క్లుప్తంగా

సాయినాథునికి విశేష అర్చన



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని శ్రీషిర్డీ సాయినాథస్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున కాగడహారతి ఇచ్చి సాయినామంతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం మండపం వద్ద వేదపండితులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో మండపరాధన, గణపతిపూజ, నవగ్రహారాధన, పుణ్యాహవాచనం, అష్టదిక్పాలపూజ, స్వామికి విశేష పంచామృతాలతో స్నపన నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించి అర్చకులు విశ్వనాథ శాస్త్రి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ వై. శ్రీనివాస రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో తాగునీటి పైపులైన్ల మరమ్మతుల నిమిత్తం తాగునీటి సరఫరాను సోమవారం నిలిపివేశారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాగునీరు నిలిపివేసిన గంగానమ్మపేట ప్రాంతంలో కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. సాయంత్రానికి పైపులైన్ల మరమ్మతులు నిర్వహించి తాగునీటిని పునరుద్ధరించినట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలియజేశారు.

నేడు జనరిక్ మందులపై అవగాహన

గుంటూరు మెడికల్: జన ఔషధి దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో జనరిక్ మందులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా పాల్గొని జనరిక్ మందులపై ప్రజలకు, ఔషధ విక్రేతలకు అవగాహన కల్పిస్తారని తెలియజేశారు. ఇంకా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ఎస్.రవిశంకర్ నారాయణ సదస్సులో మాట్లాడతారని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని లక్ష్మణ్ కోరారు.

కాశీ విశ్వేశ్వరుడికి విశేష అభిషేకాలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని విశాలాక్ష్మి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ 81వ వార్షికోత్సవం సందర్భంగా రెండోరోజు ఆలయంలో సోమవారం అర్చకుడు ఆంజనేయశాస్త్రి విశేష పూజలు చేశారు. ఉదయాన్నే గణపతి పూజ, స్వామికి నమకచమకాలతో అభిషేకాలు చేసి అమ్మవార్లకు విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం విశేష గ్రామ బలిహరణ నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం రాయబారం, ఎదురుకోళ్లు నిర్వహించి స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాలను దేవదాయ ధర్మాదాయశాఖ ఈఓ గాదె రామిరెడ్డి పర్యవేక్షించారు.

నేడు రాధా శ్యామసుందరుల విగ్రహ పునఃప్రతిష్ట

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి ఇస్కాన్‌లో రాధా శ్యామసుందరుల విగ్రహ పునఃప్రతిష్ఠ మంగళవారం నిర్వహించనున్నట్లు మందిర అధ్యక్షుడు చక్రధరి దాస్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నూతనంగా నిర్మించిన గర్భాలయంలో కనకపు పూత సింహాసనం మీద రాధా శ్యామసుందరుల పునఃప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి మహాభిషేకం, రాత్రి 8 గంటలకు 1000 కేజీల పూజలతో పుష్పాభిషేకం, అనంతరం అన్నదాన వితరణ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఆయన ఆ ప్రకటనలో కోరారు.

మొరాయించిన నిడమర్రు రైల్వేగేటు



మరమ్మతులకు గురైన నిడమర్రు రైల్వేగేటు



బాపనయ్యనగర్ అండర్ పాస్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

అవస్థలు పడిన వాహనచోదకులు

మంగళగిరి: నగరంలోని నిడమర్రు రైల్వేగేటు మొరాయించడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు గేటు వేశారు. అనంతరం రైలు వెళ్లిన తరువాత గేటు తీసేందుకు ప్రయత్నించగా ఎంత సేపటికీ తెరుచుకోలేదు. దీంతో గేటుకు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. పాఠశాలలు, కళాశాలల బస్సులు విద్యార్థులను ఎక్కించుకుని ఇళ్లకు తీసుకువెళ్లే సమయంలో గేటు సాంకేతిక కారణంతో తెరుచుకోవకపోవడంతో విద్యార్థులు సైతం ఆందోళన చెందారు. ఇరువైపులా వాహనచోదకులు బాపనయ్య నగర్ అండర్ పాస్ మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ కూడా ఇరువైపులా ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే గేట్ మెన్ ఉన్నతాధికారులు సమాచారం అందించారు. వాహనచోదకులు ప్రత్యామ్నాయ రహదారి మార్గాలైన నవులూరు టౌన్‌షిప్, చినకాకానితో పాటు పలుమార్గాల ద్వారా నిడమర్రు, కురగల్లు, నీరుకొండ, తాడికొండ, కంతేరు, ఐనవోలు తదితర గ్రామాలకు చేరుకున్నారు. రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేయడంతో రాత్రి 9:20లకు గేటు తెరుచుకుంది.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీదేవి ఆకస్మిక తనిఖీ

తాడికొండ: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అధికారులకు సూచించారు. తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి పరిశీలించేందుకు వెళ్లిన ఆమె ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. హరిశ్చంద్రపురంలో తాగునీటి సమస్య ఉందని తెలియజేడంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడి సాయంత్రం 6 గంటల్లోగా పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఐనవోలు గ్రామంలో ఫిల్టర్ బెడ్ల నిర్మాణం ప్రారంభం ఆలస్యం కావడంపై ఆరా తీసి వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాయపూడి గ్రామంలోని వివిధ రోడ్ల నిర్మాణాలకు మండల పరిషత్ నిధులతో అంచనాలు రూపొందించి త్వరితగతిన పనులు చేయాలని ఆదేశించారు. తుళ్లూరు 1,2,3 వార్డులలో మిగిలిపోయిన రోడ్లను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



స్పందనలో వచ్చిన సమస్యలను నోట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

మూడు దశాబ్దాల తర్వాత అ'పూర్వ' కలయిక



గుంటూరు మెడికల్: తాడికొండ భగవాన్ శ్రీ సత్య సాయిబాబా జూనియర్ కళాశాలలో 1990–92లో ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులు 31 సంవత్సరాల తరువాత సోమవారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో కలుసుకున్నారు. విద్యాభ్యాసం అనంతరం వివిధ వృత్తుల్లో, దేశ, విదేశాల్లో స్థిరపడి బిజీ లైఫ్‌లో జీవనం సాగిస్తున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట సమావేశమై కాలేజీ జ్ఞాపకాల్ని నెమరువేసుకున్నారు. ఏపీ ఎన్జీవో గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కలయికలో వారి విద్యా బోధన చేసిన గురువులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, కెమిస్ట్రీ లెక్చరర్ శంకరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్లయ్య, సుబ్బారావు, పతంజలి, సాంబిరెడ్డి, సుధాకర్, పద్మజ, అరవింద, నందకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్‌లో సోమవారం జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులకు సైన్స్ సబ్జెక్ట్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కెమిస్ట్రీ, ఫిజిక్స్‌పై అవగాహన, వాటి ప్రాముఖ్యత పెంపొందించడానికి సౌత్ జోన్ అసోసియేషన్ ఆఫ్ కెమిస్ట్రీ టీచర్స్ సెక్రటరీ డాక్టర్ మన్నం కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ కొండమూడి రవీంద్రకుమార్, ఫౌండర్ ట్రస్ట్ కోనేరు చారిటబుల్ ట్రస్టు వాసుదేవరావు, రిటైర్డ్ ఇంజినీర్ శివారెడ్డిలు రెండు సబ్జెక్టుల గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ జయకుమార్, ప్రిన్సిపాల్ అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలి రూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం.. పట్టణ చినరావూరు తోటకు చెందిన షేక్ మస్తాన్‌వలి, షేక్ గఫూర్ పక్కపక్కన ఇళ్లలో నివసిస్తుంటారు. ప్రహరీ నిర్మాణం విషయంలో ఘర్షణ పడడంతో మస్తాన్‌వలిపై గఫూర్, అతడి తరఫు వారు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు సోమవారం నమోదు చేశారు.

ప్రాతూరులో కార్పొరేషన్ అధికారుల పర్యటన

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రాతూరులో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి సోమవారం తమ సిబ్బందితో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకదుర్గ వారధి రేవల్లె కరకట్టకు అనుసంధానంగా ఉన్న ప్రాతూరు కుంచనపల్లి రోడ్డులో ప్రతిరోజూ వందలాది వాహనాలు తిరుగుతుండడంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. చుట్టూ పంటపొలాలు ఉండడంతో మట్టిజారిపోయి రోడ్డు ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా పోతోందని, దాంతో రూ.40 లక్షలు కార్పొరేషన్ నిధుల నుంచి కేటాయించి రహదారికి ఇరువైపులా కీవాల్ ఏర్పాటు చేసి 40 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రహదారి నిర్మించామని, అందులో 7 మీటర్ల పొడవున బీటీ రోడ్ నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. అలాగే 14 –15వ ఆర్థిక సంఘం నుంచి ప్రాతూరులో పలు సీసీ రహదారులు, సీసీ డ్రైన్లు, గ్రావెల్‌రోడ్లు నిర్మిస్తున్నామని, ఇప్పటికే గ్రామస్తుల సూచనల మేరకు ప్రాతూరులోని రోడ్లన్నీ సర్వే చేసి నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నేటి నుంచి 5 కొత్త రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగుర్ వలి, ప్రాతూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి, మరియబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రాతూరులో అభివృద్ధి పనులపై గ్రామస్తులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. సోమవారం తాడేపల్లిరూరల్ పరిధిలోని గుండిమెడ గ్రామంలో రైతు, కౌలురైతు సంఘం నాయకులతో కలసి చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జొన్నా శివశంకర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంపద అంతా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. ఢిల్లీ కేంద్రంలో నల్ల చట్టాల రద్దు కోసం సంవత్సర కాలం పాటు రైతాంగ ఉద్యమం మహా ఉద్యమంలా కొనసాగిందని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి రూ.600 కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కేవీపీఎస్ నాయకులు జెట్టి రాంబాబు, సీఐటీయూ నాయకులు నల్లపు లెనిన్, తురక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తూటుకాడను తొలగించాలి

పంటపొలాలను నీరందించే గుంటూరు చానల్ పూర్తిగా తూటుకాడతో నిండిపోయిందని, తూటుకాడను తొలగించాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం నాయకులతో కలిసి కొలనుకొండ వద్ద గుంటూరు చానల్‌ను ఆయన పరిశీలించారు. ఏపీ రైతుసంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

తాడేపల్లిరూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో వ్యవసాయ పద్ధతులను అనుసరించి పండించిన మిర్చి పంట విలువ ఆధారిత ఉత్పత్తులను విశ్వవిద్యాలయ ప్రొ.చాన్స్‌లర్ డాక్టర్ జగన్నాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామం నుంచి వచ్చిన మహిళా స్వయం సహాయక బృందం సభ్యుల కృషిని కొనియాడుతూ వారు తయారు చేసిన మిర్చిపొడిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మిర్చి రైతులు డ్రిప్ ఇరిగేషన్, ఐఓటీ, మొబైల్ యాప్‌లు వాడడం ద్వారా 25 శాతం అధిక దిగుబడిని సాధించారని, మహిళా స్వయం సహాయక బృందాలు ఈ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసి అమ్మడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతున్నారని అన్నారు. ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ బృందాలకు గ్రైండింగ్ మిషన్లు, తూకాలు, కవర్లు, సీలింగ్ మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విభాగ డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్, నైపుణ్య అభివృద్ధి డీన్ డాక్టర్ శ్రీనాథ్, ఉపాధి కల్పన డీన్ డాక్టర్ ప్రసాద్, విభాగ అధిపతులు డాక్టర్ మురుగన్, డాక్టర్ సుమన్, డాక్టర్ భగవాన్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ స్వప్న, డాక్టర్ రాధికారాణి, స్వయం సహాయక బృంద సభ్యులు రేణుకాదేవి, మంగమ్మ, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న ప్రొ.చాన్స్‌లర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు

రోగులకు మజ్జిగ పంపిణీ

గుంటూరు మెడికల్: కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జీజీహెచ్ వద్ద రోగులు, సహాయకులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు 1500 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు ట్రస్టు నిర్వాహకుడు పఠాన్ అల్లాబక్షు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి యున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించినట్లు కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో హుండీలను లెక్కించగా రూ. 26,55,639 నగదు, 58 గ్రాముల బంగారం, 898 గ్రాముల వెండి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించగా దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి. రంగప్రసాద్, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారని తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తెనాలి రహదారిలోని తుమ్మపూడి వద్ద ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం తెనాలి వైపు నుంచి వస్తున్న ఆటో తుమ్మపూడి వద్ద రోడ్డుమీద వున్న గోతులను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్, అందులో ఉన్న మరో వ్యక్తి గాయపడ్డారు. ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో దుగ్గిరాల 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది గాయపడిన ఆటో డ్రైవర్‌కు ప్రథమ చికిత్స నిర్వహించి తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాడికొండలో ముగ్గురికి తీవ్ర గాయాలు..

తాడికొండ: ప్రయాణికులతో వెళుతున్న ఆటో బోల్తా పడి ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలైన ఘటన తాడికొండ శివారు కంతేరు రోడ్డులో జరిగింది. వివరాల ప్రకారం తాడికొండ నుంచి ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న మరొక ఆటో బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్, ఇద్దరు ప్రయాణికులకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో రెండు ఆటోలు ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్‌ఐ నరసింహ వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

అనంతవరం(తాడికొండ): కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, ప్రతి పేదవాడికి సంక్షేమం చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. సోమవారం తుళ్లూరు మండలం అనంతవరంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీ, రోడ్లు ఇతర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతవరంలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న కత్తెర సురేష్ కుమార్

ఘనంగా ఉరుసు గంథం మహోత్సవం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల గ్రామంలోని కొత్తలాకుల సమీపంలో జెండాచెట్టు బజారులో వేంచేసి యున్న నాగేంద్రస్వామి పుట్ట వద్ద హజరత్ నాగుర్ మీరావలి 14వ జెండా ఉరుసు గంథ మహోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావులు విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి, ప్రేమ వర్ధిల్లుతాయని అన్నారు. ప్రతి ఏటా నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఉరుసు గంథ మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహిస్తూ ఆధ్యాత్మిక భావనలు పెంపొందిస్తున్నారని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరి రావు మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక భావనలు అవసరమని అన్నారు. పూజల అనంతరం జెండాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర ఎనర్జీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అందే రాజేష్, ఆలయ కమిటీ నిర్వాహకులు పఠాన్ షాబుద్దీన్, అందే వెంకట శివకళ్యాణ్, షేక్ మొహిద్దీన రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని పెరుకులపూడి గ్రామంలో ఓ బాధిత మహిళకు మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణా రెడ్డి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ సాయాన్ని సోమవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు బాధిత మహిళ బొప్పూడి అంజనాదేవి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంపల గంగాధర్, ఉప సర్పంచి తాడిబోయిన గంగాధర్, మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నూతలపాటి కేశవరావు, నల్లగొర్ల నాగేశ్వరరావు, ఆళ్ల మహేష్, నల్లగొర్ల వీరయ్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జడ్పీటీసీ అరుణ

వైద్యశిబిరానికి విశేష స్పందన

నిడుముక్కల(తాడికొండ): తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక ఎస్సీ కాలనీ కమ్యూనిటీ భవనం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి మాదాసు రత్నకుమారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 90 మంది రోగులకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అమరావతికి చెందిన శ్రీ లక్ష్మీ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ ఎం.శ్రీధర్‌చంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి మాదాసు ఏసురత్నం, నిర్వాహకులు సుశీల్‌రావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు రోడ్డు విస్తరణ నేపథ్యంలో నిడమర్రు ఎస్సీ కాలనీ శివాలయం ఏరియాలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు తుళ్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం

తాడికొండ: నేడు తుళ్లూరు సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.